


జడ్పీ సమావేశంలో వేదికపై చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు,కలెక్టర్ తదితరులు - సభ్యుల వాగ్వాదం

గతం మరిచారా అన్నా!

- జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే ద్వారకపై జగన్, మురళి వ్యంగ్యాస్త్రాలు
- శ్రీకాళహస్తి జడ్పీటీసీపైకి దూసుకెళ్లిన వైసీపీ సభ్యులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విమర్శలు ప్రతివిమర్శలతో చిత్తూరు జడ్పీ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. గత సమావేశాలతో పోల్చితే మంగళవారం జరిగిన ఈ సమావేశం భిన్నంగా సాగింది. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ఎత్తిచూపే ప్రయత్నం చేసిన శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డిపై వైసీపీ సభ్యులు దాడి చేసినంత పని చేశారు.దీంతో కాసేపు సభ రసాభాసగా మారింది.

మేం అనుకుంటే మీరు మీటింగుకు వచ్చేవారా?

తంబళపల్లె నియోజకవర్గంలో జడ్పీటీసీలను, ఎంపీపీలను, ఎంపీటీసీలను ఏ సమావేశాలకూ హాజరు కానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ 'రాష్ట్రానికి 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన మా నాయకుడు చంద్రబాబు పైనే రాళ్లు వేసి దారుణంగా అడ్డుకున్నారే, దాంతో పోలిస్తే మీరు చెప్పేది అసలు విషయమే కాదునా' అనడంతో సభలో నవ్వులు విరిశాయి. మీ నాయకుడి(జగన్)లా మా నాయకుడు(చంద్రబాబు) చూసీచూడనట్లు వదిలేసి ఉంటే వైసీపీ సభ్యులు సమావేశానికి వచ్చేవారా? గొడవకు దిగేవారా అని నవ్వుతూ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. 'మా నాయకుడు క్రమశిక్షణకు మారుపేరు కాబట్టే ఈ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యులతో జరుగుతోంది. లేదంటే వేరే మాదిరిగా ఉండేది'అని వైసీపీ సభ్యులకు ఘాటుగా సమాధానం చెప్పారు.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకేది?

తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరు మాట్లాడినా కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి విమర్శించారు. దీనిపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ స్పందిస్తూ.. 'వైసీపీ హయాంలో రైతు నుంచి కూలీ వరకు ఎవర్నీ వదలకుండా సుమారు 600మందికి పైగా కేసులు పెట్టి ఊర్లోకి వచ్చేదానికే భయపడేలా చేశారే! అప్పుడు ఎందుకు ఇవి మాట్లాడలేదనా' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.' బలవంతపు ఏకగ్రీవాలతో దౌర్జన్యంగా ఎన్నికైన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు ప్రజాస్వామ్యం అంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉంది' అని ఎద్దేవా చేశారు. అధికారులు.. మర్యాద ఇవ్వడం లేదని, అభివృద్ధి పనులు చేసే ముందు సంప్రదించడం లేదని సభ్యులు ఆరోపించగా.. ఎమ్మెల్యే కలగజేసుకొని మీరు రెజల్యూషన్ ఇచ్చేవరకు అభివృద్ధి పనులు ఆగవని సమాధానం చెప్పారు.

● నచ్చకే వైసీపీ నుంచి వచ్చేశాం

జడ్పీటీసీలకు, ఎంపీపీలకు ఈ ప్రభుత్వంలో గౌరవం ఇవ్వడం లేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి సభలో ప్రస్తావిస్తే.. దానిపై శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి స్పందించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జడ్పీటీసీలను, ఎంపీపీలను కనీసం గౌరవించలేదని, ఎమ్మెల్యేలే పెత్తనం చేసేవారనడంతో ఒక్కసారిగా వైసీపీ సభ్యులు ఆయనపైకి దూసుకొచ్చి దుర్భాషలాడారు. నువ్వుకూడా వైసీపీ సభ్యుడివే కదా అని వైసీపీ సభ్యులు అనగా... అది నచ్చకే ఎన్నికల ముందే బయటకు వచ్చేశామని ఆయన బదులిచ్చారు. దీంతో సభ్యులందరూ ఆయనపైకి దూసుకెళ్లారు. వెంటనే చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు కలగజేసుకొని 'శ్రీకాళహస్తి జడ్పీటీసీ చెప్పిందాంట్లో తప్పేముంది? సభలో మీ సంఖ్య ఎక్కువగా ఉందని ఆయనపైకి వెళ్లిపోతారా, ఇది పద్ధతి కాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పెండింగ్‌లో వున్న ఆరోగ్యశ్రీ బిల్లులను విడుదల చేయాలని వైసీపీ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం కోరగా వైసీపీ ప్రభుత్వ హయాం నుంచే బిల్లులు పెండింగులో ఉన్నాయి. అప్పుడు తెలియదా అంటూ శ్రీకాళహస్తి జడ్పీటీసీ మాట్లాడడంతో సభలో నవ్వులు విరిశాయి.

● పాఠశాలల బలోపేతానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. షూ నుంచి టై దాకా, బుక్స్ నుంచి భోజనం దాకా అన్నీ ఉచితంగా అందిస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంపై కారణాలు అన్వేషించాలని డీఈవోకు సూచించారు.

● సభలో సభ్యులు ప్రస్తావించిన సమస్యల న్నింటినీ మినిట్స్‌లో రాసి వాటిని వచ్చే సమావేశంలోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సభ్యులు చెప్పిన ప్రతి సమస్యనూ ఆయన నోట్ చేసుకుని సమాధానం చెప్పారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్ నాయుడు, తిరుపతి డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

7వరకు కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన సర్వేపై అభ్యంతరాలను 7వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి తెలిపారు. తుది సర్వే వివరాలను 17వ తేది వరకు అన్ని సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు.ఎస్సీ కులగణనలో తప్పులుంటే వాటిని సరిదిద్దుకోవాలని ఆమె సూచించారు.

సమగ్ర శిక్షా (ఎస్.ఎస్.): చిత్తూరు
జిల్లా పథక కార్యాలయము :: చిత్తూరు
E-Mail: ee.chittoor10@gmail.com
ఇ- ప్రొక్యూర్మెంట్ టెండర్

ఈ క్రింద తెలిపిన సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాలకు మరమ్మతులు, చిత్తూరు జిల్లా టెండర్ దారులు ఇ.మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి టెండర్ Schedules Nit.No. 02 నుండి 04 వరకు తేది: 01-01-2025 ఉ॥ గం॥11:00 నుండి 09-01-2025 మ॥ గం॥ 2:30ని వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చును. టెండర్లు స్వీకరణకు చివరి తేది: 10-01-2025 సా॥ గం॥ 4.00 వరకు మరియు బిడ్‌లు తేది: 10-01-2025 సా॥ గం॥ 5:00 లకు తెరవబడును. ఒక్కో టెండరుదారు ఒక పనికి మాత్రమే టెండర్ వేయవచ్చు.

క్ర.సం.	మండలం పేరు	పని పేరు	అంచనా వ్యయం రూ. లక్షలు
1	నగరి	NIT.No.02 ప్రభుత్వ (సాంఘిక సంక్షేమ) బాలుర వసతి గృహం	17.50
2	నగరి	NIT.No.03 ప్రభుత్వ (సాంఘిక సంక్షేమ) బాలికల వసతి గృహం	10.00
3	నగరి	NIT.No.04 ప్రభుత్వ (సాంఘిక సంక్షేమ) కళాశాల బాలికల వసతి గృహం	10.00
		మొత్తం	37.50

వివరములకు www.eprocurement.gov.in నందు చూడవచ్చును.
సెల్.నెం: 7207790173 నంబరుకు సంప్రదించగలరు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,సమగ్ర శిక్షా, చిత్తూరు.

జనవరి ఫస్టు వేడుకలకు కాణిపాకం సిద్ధం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి జనవరి ఫస్టున వచ్చే భక్తులకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చిన వారందరికీ దర్శనం కల్పించేందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. తాత్కాలికంగా అంతరాలయ దర్శనాన్ని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. స్వామి దర్శనాన్ని రాత్రి 10 గంటల దాకా కొనసాగిస్తామన్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు బాదం పాలు, బిస్కెట్లు, పులిహోర అందిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని వెలుపలకు రాగానే ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు వీలుగా లడ్డూ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఎనిమిది వేల పెద్ద లడ్డూలు, 80 వేల చిన్న లడ్డూలను సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. క్యూలైన్లలో ఎవరైనా అస్వస్థతకు గురైతే అందుబాటులో ప్రథమ చికిత్సాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాణిపాకానికి విచ్చేసే భక్తుల వాహనాలను పార్కింగ్ చేయడానికి ఖాళీ స్థలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

5, 6, 7 తేదీల్లో సీఎం పర్యటన

అధికారులందరూ సన్నద్ధం కావాలన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 5, 6, 7 తేదీల్లో కుప్పంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కడా పీడీ వికాస్ మర్మత్ సీఎం పర్యటనకు సంబంధించిన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌లో భాగంగా నడిమూరులో సోలరైజేషన్‌కు సంబంధించి ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్ అధికారులు సర్వే, ఇతరత్రా పనులను పూర్తిచేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రపరిశీలనకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు.ప్రతి శాఖ చేస్తున్న కార్యక్రమాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, డీఆర్వో మోహన్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, హౌసింగ్ పీడీ పద్మనాభం, ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ తీసుకున్న కాసేపటికే ఆగిన గుండెలు



మృతులు సయ్యద్ సాహెబ్, అమీనా, సులేమాన్ (ఫైల్ ఫొటోలు)

కల్లూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందే పెన్షన్ తీసుకున్న ఆ ముగ్గురు వృద్ధులు హఠాన్మరణం పాలవడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. పులిచెర్ల మండలం కల్లూరు దిగువవీధికి చెందిన కె.సయ్యద్‌సాహెబ్ (75) ఇంటి వద్దకు మంగళవారం ఉదయం 5:52 గంటలకు సచివాలయ ఉద్యోగి భరత్ చేరుకున్నాడు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రూ.4వేలు అందజేశాడు. పెన్షన్ తీసుకున్న కొద్ది సేపటికే గుండెపోటుతో సయ్యద్‌సాహెబ్ మృతి చెందాడు. ఇదే గ్రామంలోని దాసరిగూడేనికి చెందిన పి. అమీనా(79) ఇంటి వద్దకు చేరుకున్న వీఆర్వో శకుంతల ఉదయం 6.47 గంటల సమయంలో పెన్షన్ రూ.4వేలు అందజేసింది. పెన్షన్ తీసుకున్న అమీనా అదే క్షణంలో గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందింది. దిగువవీధికే చెందిన షేక్ సులేమాన్(60) ఇంటి వద్దకు సచివాలయ ఉద్యోగి హిమశేఖర్ ఉదయం 7.08 గంటలకు చేరుకొని పింఛన్ అందజేశాడు.ఇటీవల అనారోగ్యానికి గురైన షేక్ సులేమాన్ పెన్షన్ తీసుకున్న కొంత సేపటికే మృతి చెందాడు.

తప్ప తాగి దాడిచేసిన ఇద్దరు తహసీల్దార్ల సస్పెన్షన్



జి.ఎల్. శివకుమార్ - ఎం.ఎస్. ప్రసన్నకుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తప్ప తాగి బండబూతులు తిడుతూ వీధిరౌడీల్లా ప్రవర్తించిన ఇద్దరు ఇన్‌చార్జి తహసీల్దార్లను కలెక్టర్ సస్పెండ్ చేశారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ, విచారణ పూర్తయ్యేంత వరకు హెడ్‌క్వార్టర్స్ వీడరాదని ఆదేశించారు.గంగవరం ఇన్‌చార్జి తహసీల్దార్ జి.ఎల్. శివకుమార్, పెద్దపంజాణి ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.ఎస్. ప్రసన్నకుమార్ చిత్తూరు నగరంలోని ప్రభా గ్రాండ్ హోటల్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై సోమవారం రాత్రి మద్యం మత్తులో కృష్ణకుమార్ అనే నగరవాసిపై దాడిచేసి గాయపరచడంపై వార్తా పత్రికల్లో ప్రచురితం కావడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. వారిద్దరిపై క్రమశిక్షణాచర్యలు తీసుకోవాలని నిర్ణయించిన కలెక్టర్ ఏపీ సీసీఎల్ఏ రూల్స్ 1991 రూల్ 8(1)(ఏ) మేర సోమవారం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అనుమతి లేకుండా వారు పనిచేస్తున్న మండల కేంద్రాలను వీడరాదని సూచించారు.బాధ్యతారహితంగా ప్రవర్తించిన ఇన్‌చార్జి తహసీల్దార్లు శివకుమార్, ప్రసన్నకుమార్ మంగళవారం మధ్యాహ్నం నుంచీ రాత్రివరకు కలెక్టరేట్‌లోనే వున్నారు.

21మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెవిన్యూశాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఎంఆర్‌ఐలుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో పనిచేస్తున్న 80 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టుల్లో మూడుసంవత్సరాలు ప్రొబేషన్ పూర్తి చేసుకున్నవారిని,సర్వే ట్రైనింగ్, అకౌంటెంట్ పరీక్షలు ఉత్తీర్ణులైనవారిని కలెక్టరేట్ వర్గాలు గుర్తించాయి. ఇతర కారణాలతో వీరిలో టీ. సాంబశివాచారి (తిరుపతి), టి. సుజాత (తొట్టంబేడు)లకు మినహాయింపు ఇచ్చారు. పదోన్నతి పొందిన జాబితాను ఇదివరకే ప్రదర్శనకు ఉంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఎట్టకేలకు సీనియారిటీ పొందిన 21మందిని అర్హులుగా గుర్తించి తుది జాబితా తయారుచేశారు. వీరికి అడహాక్ పద్ధతిలో పదోన్నతి ఇస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏ కారణం చేతైనా భవిష్యత్‌లో ఇచ్చిన పదోన్నతిని రద్దుచేసే అవకాశం ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎవరూ కూడా సీనియారిటీ అంటూ ఏ విధమైన క్లెయిమ్స్ చేసేందుకు అర్హులు కాదన్నారు.పదోన్నతి పొందిన 21 మందికి ప్లేస్మెంట్ పోస్టింగ్ ఆర్డర్లు త్వరలో జారీచేయనున్నారు.

బొకేలతో రావొద్దు ప్లీజ్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌కు బొకేలు, కేకులతో అధికారులు రావొద్దని కలెక్టరేట్ వర్గాలు సూచించాయి.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో బుధవారం వరకూ ఏడురోజుల పాటు సంతాపదినాలుగా ప్రకటించినందున ప్రతిఒక్కరూ ప్రభుత్వఆదేశాలను కచ్చితంగా పాటించాలని కోరాయి.


కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



హ్యాపీ గ్రీన్ ఇయర్ నినాదంతో మొక్కలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


కల్లూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త వెంకటశిద్దులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రకాష్ తెలి పారు. పులిచెర్ల మం డలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించారు. హ్యాపీ గ్రీన్ ఇయర్-2025 నినాదంతో విద్యార్థులచే మొక్కలు ప్రదర్శించారు. రంగోళి పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యా యులు రాజశేఖర్, స్నేహమాలిని, చంద్రబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలో హారికకు ప్రథమ స్థానం



వి.కోట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గోనుమాకులపల్లె ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హారిక అనే విద్యార్థి జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో నిలిచింది. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన విజ్ఞాన మేళాలో విద్యార్థిని తయారు చేసిన యాటర్న్ ఇన్ సిగ్నలింగ్ అనే ప్రదర్శనకు ప్రథమ బహుమతి అందుకున్నట్లు ప్రధానోపాధ్యా యులు వెంకట్రామిరెడ్డి తెలిపారు. హారికను ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు వెంకటరెడ్డిని గ్రామపెద్దలు అభినందించారు.





రీసర్వేపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఆర్డీవో భవాని, తహసీల్దారు ఇన్బనాథన్

పలమనేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రంగినాయనిపల్లిలో మంగళవారం భూ రీసర్వేపై పలమనేరు ఆర్డీవో పి.భవాని ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఆర్డీవో మాట్లాడుతూ భూ సర్వేపై రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. రీసర్వేతో పారదర్శకంగా భూరికార్డులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలమనేరు తహసీల్దారు ఇన్బనాథన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, రీసర్వే ఉప తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పలమనేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై.. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్రసాద్, ఉపాధ్యాయులు రవికుమార్, పత్తిపాటి రవిలతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు భరోసా



పుంగనూరులో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్ననాయకులు

పుంగనూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నారని.. రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి శ్రీకాంత్, సీవీరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. గతంలో కంటే ప్రస్తుతం అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. రూ.100 లతో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదాల్లో మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిరణ్, వెంకటేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏతూరు, చదళ్ల సర్వేయర్లు శోభారాణి(32), కీర్తి(22) ద్విచక్రవాహనంలో పింఛన్లు పంపిణీ చేయడానికి ఏతూరుకు వెళుతుండగా నెక్కుందికి చెందిన చంద్ర(27) జెటాన్ సమీపంలో అదుపుతప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్ర పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో తిరుపతికి తరలించారు.

నడకతో ఆరోగ్యం పదిలం



జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ

గుడుపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మనిషి ఆరోగ్యం కోసం నడక ఎంతో అవసరమని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. మంగళవారం ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని మెయిన్ గేటు వద్ద వీసీ జెండా ఊపి ప్రారంభించారు. రోజూ కనీసం అర్ధ గంట పాటు నడిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి యామిగానిపల్లె వరకు ఫిట్ రన్ కొనసాగించారు. రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, పీడీ శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరూరా.. పింఛన్ల పండుగ ..!



పులిచెర్ల మండలం దేవళంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

- ఒక రోజు ముందుగానే పంపిణీ చంద్రన్నకే సాధ్యం
- లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం : చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ పండుగలా నిర్వహించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేటలోని ఎస్టీ కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీన ఆదివారాలు.. పండుగలు వస్తే ముందు రోజే పింఛన్ల పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూసేందుకు ప్రభుత్వం వేకువజాము నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తోందని తెలిపారు.

● ఆలయ నిర్మాణ స్థలం పరిశీలన

దేవళంపేట పంచాయతీ మిట్టమీదరాచపల్లిలో నిర్మించనున్న రామాలయం స్థలాన్ని చల్లా రామచంద్రారెడ్డి పరిశీలించారు. వెంటనే పనులు ప్రారంభించాలని.. తన సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, మురళీధర్, ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి, మురళీధర్ నాయుడు, నారాయణస్వామినాయుడు, గోపినాయుడు, యర్రయ్య, ప్రభాకర్, కరుణాకర్‌నాయుడు, అనీల్ కుమార్, అబ్బాస్, ముద్దుస్వామినాయుడు, వెంకటముని నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

●చౌడేపల్లె: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసినట్లు రాజంపేట అధికార ప్రతినిధి కళ్యాణ్ తెలిపారు. మండలంలో 6,585 పింఛన్లకు గాను 6,311 మందికి పంపిణీ జరిగిందని.. 96.11 శాతం మందికి పంపిణీ చేసినట్లు మంగళవారం ఎంపీడీవో లీలామాధవి తెలిపారు.

●సోమల: మండలంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో నారాయణ పరిశీలించారు. ఇరికిపెంటలో సర్పంచుల సంఘ మాజీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు కొత్త పింఛన్లను అందించారు. కందూరులో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యనాయుడు, సోమలలో తహసీల్దారు బెన్నురాజ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

●పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో మంగళవారం 96.92 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం పింఛనుదారులు 4,581 మందికి గాను 4,440 మందికి పంపిణీ చేశామని పేర్కొన్నారు. అందుబాటులో లేనివారికి జనవరి ఒకటో తేదీన అందిస్తామని తెలిపారు.

పెద్దపంజాణి మూడో స్థానం

●పెద్దపంజాణి: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ప్రభుత్వం పింఛన్ల పంపిణీ ఒక రోజు ముందుగా పంపిణీ చేపట్టింది. మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లాలో పెద్దపంజాణి మండలం మూడో స్థానంలో నిలిచిందని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. మండలంలో 8,173 పింఛన్లకు గాను 7,957 పింఛన్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న రాజంపేట అధికార ప్రతినిధి కళ్యాణ్



పలమనేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

●రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, నాయకులు సహదేవ, ఈశ్వరయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బైరెడ్డిపల్లెలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు చేపడుతోందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో జగన్ బొమ్మలు ముద్రించి పాసు పుస్తకాలు మంజూరు చేయడంతో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేసి ఏనుగుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఏనుగుదాడిలో మృతిచెందిన కుప్పనపల్లెకు చెందిన శంకరప్ప కుటుంబానికి ప్రభుత్వ సాయం రూ.5 లక్షల చెక్కును అందించారు. నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేశారు. బైరెడ్డిపల్లె పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ సూచనలిచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ సబ్‌డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్‌ఆర్వో నారాయణ, తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, పలువురు టీడీపీ నాయకులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకుతో గొడవపడి ఆత్మహత్య



వెంకటేష్

చౌడేపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌడేపల్లె మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. అంకుతోటపల్లెకు చెందిన వెంకటేష్ (58) తన కుమారుడితో గొడవ పడి మన స్థాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పుంగనూరు ప్రభుత్వా సుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు.

ఘనంగా అమావాస్య పూజలు

రామకుప్పం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని పలు ఆలయాల్లో సోమవారం రాత్రి అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. గంగమ్మ, కాశీవిశ్వేశ్వర స్వామి గంగమ్మ ఆలయాల్లో అభిషేక పూజలు నిర్వహించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి రైతు మృతి



మృతిచెందిన చలపతి

వి.కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వి.కోట-కుప్పం ప్రధాన రహదారిలో అన్నవరం క్రాస్ వద్ద ద్విచక్రవాహనంపై కూరగాయలను మార్కెట్ తరలిస్తూ అదుపు తప్పి పడి ఓ రైతు మృతి చెందాడు. సొండ్లపల్లెకు చెందిన రైతు చలపతి తన ద్విచక్ర వాహనంలో రెండు బస్తాల బీన్స్ కాయలను తీసుకొస్తూ పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వి.కోట ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమాలను తొలగిస్తున్న అధికారులు

గుడుపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొడతనపల్లెలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న గోకులం షెడ్‌ను అధికారులు మంగళవారం తొలగించారు. గ్రామస్థుల మాట వినకపోవడంతో రెవెన్యూ అధికారులకు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు. మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారు కిరణ్‌కుమార్ అక్రమంగా నిర్మిస్తున్న స్థలాన్ని పరిశీలించి నిర్మాణాలను తొలగించారు. కార్యక్రమంలో సర్వేయర్ రత్నప్ప, వీఆర్‌వో శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీ మాధవి

చౌడేపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని.. డీటీ మాధవి అన్నారు. మంగళవారం స్థానిక పొదలపల్లెలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సమస్యలపై తెలియజేస్తే ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రత్యేక పథకాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో విజయ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, బ్యాంకు రెడ్డెప్ప, వేణు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేఈసీ క్యాలెండర్ ఆవిష్కరణ



కేఈసీ అకడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్టీయూఏ వీసీ సుదర్శనరావు తదితరులు

కుప్పం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఇటీవల యూజీసీ వారిచే పదేళ్ల (2024-25 నుంచి 2033-34) వరకు స్వయం అటానమస్ (స్వయం ప్రతిపత్తి) పొందింది. అనంతపురంలోని జేఎన్టీయూలో కళాశాల నూతన అకడమిక్ క్యాలెండర్‌తో పాటు బ్రోచర్‌ను మంగళవారం ఛాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కూడిన ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దుతూ బోధన, పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన కేఈసీ సంతరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తన పాఠ్యాంశాలను రూపకల్పన చేయడానికి అపారమైన అనుభవం గడించిన అధ్యాపక బృందంతో, పరిశ్రమల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తదనుగుణంగా కేఈసీ ముందడుగు వేయడం గర్వించదగ్గ విషయమని ప్రశంసించారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, మెకానికల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ గణేశ్ పాల్గొన్నారు.

ఆరు నెలల్లోనే దగ్గుమళ్ల చెరగని ముద్ర



- చిత్తూరు పార్లమెంటు అభివృద్ధి కోసం తాపత్రయం
- లోక్‌సభతో పాటు కేంద్ర మంత్రుల వద్దా గళాన్ని వినిపిస్తూ..
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.26.50 కోట్లతో 85 పనులు
- ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటు కోసం కేంద్రంతో చర్చలు
- కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు కోసం కృషి









సాధారణంగా ఎంపీలు ప్రజలతో, నాయకులతో మమేకమవ్వకుండా నామమాత్రంగా వ్యవహరిస్తూ ఉంటారు. చంద్రబాబు ఆదర్శ రాజకీయాలను స్ఫూర్తిగా తీసుకుని ఐఆర్ఎస్ అధికారిగా రాజీనామా చేసి, తాజా ఎన్నికల్లో చిత్తూరు ఎంపీగా అఖండ మెజార్టీతో గెలుపొందారు. గెలిచిన ఆరు నెలల కాలంలోనే చిత్తూరు పార్లమెంటు ప్రాంత అభివృద్ధిలో తన ముద్ర వేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతున్నారు. లోక్‌సభతో పాటు నిత్యం కేంద్ర మంత్రుల్ని కలిసి చిత్తూరు సమస్యల్ని వినిపిస్తున్నారు. ఇప్పటికే కొన్నింటికి పరిష్కారాలు చూపించారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఈ ఆరు నెలల కాలంలో రూ.4.71 కోట్ల ఎంపీ లాడ్స్ నిధుల్ని కేటాయించారు. పాకాలలో రైల్వే కోచ్ డిపో ఏర్పాటుకు, చిత్తూరు రైల్వే స్టేషన్ మోడల్‌గా మార్చేందుకు కోసం కృషి చేశారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ పరిశ్రమల, చిత్తూరులో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు కోసం శ్రమిస్తున్నారు. చిత్తూరు ఎంపీ, లోక్‌సభ టీడీపీ ఫ్లోర్ లీడర్ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఆరు నెలల్లో చేసిన అభివృద్ధి గురించి ప్రత్యేక కథనం..

ప్రజలందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు: ఎంపీ



చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ ఏడాది పసిడి పంటలు పండి రైతులంతా శుభిక్షంగా ఉండాలని, నిరుద్యోగుల కోసం పరిశ్రమలు రావాలని, ప్రజలంతా శాంతిభద్రతలతో ఉండాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను.















రూ.26.50 కోట్లతో గ్రామాల్లో జోరుగా పనులు

గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం, రహదారుల అనుసంధానం వంటి పనుల కోసం రూ.4.71 కోట్ల ఎంపీ నిధుల్ని కేటాయించారు. 85 పనులకుగానూ 36 పూర్తయి పోయాయి. 49 పురోగతిలో ఉన్నాయి.

మామిడి బోర్డు కోసం ప్రయత్నాలు

జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి. ప్రతి ఏటా మామిడి రైతులు గిట్టుబాటు ధరల్లేక నష్టపోతున్నారు. దీన్ని గుర్తించి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు.. రైతుల సమస్యలను పరిష్కరించి, మామిడి పంటను లాభసాటిగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం చిత్తూరు పార్లమెంట్‌లో మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఎన్డీఏ సర్కారుకు పంపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. చిత్తూరు పార్ల మెంటులో మ్యాంగో బోర్డును నెలకొల్పేందుకు సిద్ధమైంది. ఇది సాకారమైతే మామిడి రైతులకు వరమనే చెప్పాలి.

కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కృషి

జిల్లా కేంద్రమైన చిత్తూరులో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఎంపీ కృషి చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు చేసిన విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకొని, ఉన్నత విద్యతోనే యువత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయగలమని భావించారు. అందుకే చిత్తూరులో కేంద్రీయ విద్యాలయ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపారు.

పాకాలలో రైల్వే కోచ్ డిపో ఏర్పాటు

నిరుద్యోగ సమస్యను గుర్తించిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పరిష్కార మార్గాన్ని చూపే దిశగా ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో చిత్తూరు పార్లమెంటు ప్రజల చిరకాల స్వప్నమైన పాకాల రైల్వేకోచ్ డిపోను నెలకొల్పడం ద్వారా దీనికి చెక్ పెట్టవచ్చని భావించారు. అనుకున్నదే తడవుగా ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల సహకారంతో పాకాలలో రైల్వేకోచ్ డిపోను నిర్మించేందుకు కావాలసిన ప్రతిపాదనలను సిద్ధం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. తక్షణం స్పందించిన కేంద్ర రైల్వే శాఖ, పాకాలలో రైల్వే కోచ్ డిపోను నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. 2025 మార్చిలో పాకాల రైల్వేస్టేషన్‌లో రైల్వే కోచ్ డిపో నిర్మాణపు పనులను చేపట్టాలని ఆదేశించింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో జిల్లావాసుల కల సాకారం, నిరుద్యోగ సమస్య కూడా పరిష్కారంతో పాటు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయి.

శరవేగంగా రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు

చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో మందకొడిగా జరిగిన ఈ పనులు, ఎంపీ దగ్గుమళ్ళ పర్యవేక్షణతో ఊపందుకున్నాయి. ఈ పనులన్నీ పూర్తయిన వెంటనే చిత్తూరు రైల్వేస్టేషన్ మీదుగా వెళ్ళే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళన్నీ చిత్తూరులో ఆపాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి కూడా మోదీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటు కోసం..

గత 30 ఏళ్లుగా నగరాన్ని కమ్ముకున్న కరువు పీడనుంది. వేసవి వస్తుందంటే గుక్కెడు నీటికి తిప్పలు పడాలని ప్రజలు భయపడేవారు. సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతి నిధులు నానాపాట్లు పడేవారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా డిమాండ్‌కు అనుగుణంగా నీటి సరఫరా చేయలేక విమర్శల పాలయ్యే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా భూగర్భ జలమట్టం వెయ్యి అడుగులకు పడిపోవడంతో కొత్తగా బోర్ల డ్రిల్లింగ్‌కు ముందుకు వచ్చేవారు కాదు. ఈ నేపథ్యంలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి, దాహార్తిని తీర్చేందుకు అమృత్ పథకం అనుసంధానంగా ఏషియన్ మౌళిక సదుపా యాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబీ) అడవిపల్లె రిజర్వాయ ర్‌కు ఇచ్చిన నిధులతో పైప్‌లైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి చిత్తూరుకు నీరు అందించాల్సిందిగా దిశానిర్దేశం చేశారు. ఈ విషయమై పైపులైను పనులు ప్రారంభించా లంటే నేషనల్ హైవే అధికారుల అనుమతులు కావాలని అధికారులు కోరారు. అందుకు తగ్గ అనుమతులకు చర్యలు తీసుకుంటు న్నారు. అడవిపల్లె రిజర్వాయర్ ద్వారా 0.785 టీఎంసీ నీటిని చిత్తూరు ప్రాంతానికి త్వరగా కేటాయించాలని నీటి పారుదల మంత్రిని ఎమ్మెల్యే కోరారు. దామల చెరువు వద్ద 37 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ సైట్ సమస్యను పరిష్కరించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించి... ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నారు.

చెరువుల సుందరీకరణ..

చిత్తూరు నియోజకవర్గంలో పలు చెరువుల సుందరీకరణకు నాంది పలికారు. గంగినేని చెరువు, కట్టమంచి చెరువులను అభివృద్ధి చేసి నగరంలో ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పేందుకు తగుచర్యలు తీసుకుంటు న్నారు. చెరువుల వద్ద మహనీయుల విగ్రహాలను ఏర్పాటుచేసి గంగినేనిపార్కులో సొంత నిధులతో హాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

పరిశ్రమల స్థాపనకు అవగాహన కల్పించాలని ఆదేశం

ఎంఎస్ఎంఈ పరిశ్రమలపై విస్తృతంగా ప్రచారం చేయించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఎంపీ దగ్గుమళ్ల ఆదేశించారు. అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా కో-ఆర్డినేటర్లను కూడా నియమించి, ఎంఎస్ఎంఈలపై అవగాహన కల్పిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని, తమ జీవితాలలో వెలుగులు నింపుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఎంపీ దగ్గుమళ్ల అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు పురోగతికి సంబంధించిన వివరాలను తెలుసుకుంటున్నారు.ఎంఎస్ఎంఈ పరిశ్రమలపై విస్తృతంగా ప్రచారం చేయించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఎంపీ దగ్గుమళ్ల ఆదేశించారు.

అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా కో-ఆర్డినేటర్లను కూడా నియమించి, ఎంఎస్ఎంఈలపై అవగాహన కల్పిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని, తమ జీవితాలలో వెలుగులు నింపుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఎంపీ దగ్గుమళ్ల అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు పురోగతికి సంబంధించిన వివరాలను తెలుసుకుం టున్నారు.

అండర్ బ్రిడ్జిల మంజూరుతో ప్రజల్లో హర్షం

చిత్తూరు మండలం, దిగువమాసపల్లి అండర్ బ్రిడ్జి, అలాగే జీడీనెల్లూరు మండలం, చిన్నవేపంజేరి రెవెన్యూ శెట్టి ఫారం గ్రామాలకు అండర్ బ్రిడ్జి కావాలని స్థానిక ప్రజలు ఎంపీని కోరారు. ఆయన చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించారు. దీంతో ఎంపీ కృషిని ఆ ప్రాంత ప్రజలు కొనియాడారు. అయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఎంపీ దొరకడం తమ అదృష్టంగా భావిస్తున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు విజన్‌ను చూసే రాజకీయాల్లోకి..

ఎంపీ దగ్గుమళ్ల టీడీపీలో చేరేందుకు కేవలం చంద్రబాబే కారణం. దశాబ్దాలుగా ఆయన్ను, ఆయన పాలన, విజన్‌ను ఉన్నతాధికారి హోదాలో చూసిన దగ్గుమళ్ల ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. - 'ఆయన విజన్ 2020 అన్నప్పుడు అందరూ నవ్వారు. దాన్ని ఆయన నిజం చేసి చూపించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాఫ్ట్‌వేర్ రంగంపై ఆధారపడనుందని అప్పట్లోనే గుర్తించి హైటెక్ సిటీని అభివృద్ధి చేశారు. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో చంద్రబాబును మించినవారు లేరు.'అని ఎంపీ నిత్యం అంటుంటారు.

చిత్తూరుకు చంద్రబాబే పంపించారు..

బ్యాంకు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీ దగ్గుమళ్ల టీడీపీలో చేరుతానని ప్రొఫైల్ అందించారు. చంద్రబాబు నుంచి ఎలాంటి హామీ పొందకుండానే ఆయన సొంత పార్లమెంటు నియోజకవర్గం బాపట్లలో టీడీపీ కోసం గట్టిగా పనిచేశారు. ఆయనకు లభిస్తున్న ఆదరణ చూసి పోటీ చేద్దామనే నమ్మకం కలిగింది. ఆ తర్వాత చంద్రబాబును కలిసి బాపట్ల ఎంపీ టికెట్ అడిగారు. కానీ, చంద్రబాబు చిత్తూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేయమని పంపించారు. అలా దగ్గుమళ్ల మీద నమ్మకంతో చంద్రబాబు తన సొంత జిల్లాకు తీసుకొచ్చారు.

చరిత్రలో నిలిచిపోయే 2.20 లక్షల ఓట్ల మెజార్టీ

ఎంపీ దగ్గుమళ్లకు వచ్చిన మెజార్టీ గతంలో ఎవ్వరికీ రాలేదు. 2,20,479 ఓట్ల మెజార్టీ రావడం అంటే సాధారణ విషయం కాదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఎంపీ ఏమాత్రం ప్రజలకు అందుబాటులో ఉండకుండా, నిత్యం పెద్దిరెడ్డి అనుచరుడిగా వ్యవహరించడంతో ప్రజలంతా విసిగిపోయారు. ఉన్నతాధికారి, ఉన్నత విద్యావంతుడు, వ్యాపారవేత్త అయినటువంటి ఈయనకు పట్టం గట్టారు.

ఎంపీ దగ్గుమళ్ల ఇంటర్వ్యూ



పూర్తి అవగాహన ఉంది.. డమ్మీ ఎంపీగా పనిచేయను..

నేను మిగిలిన ఎంపీలతో పోల్చుకోను. నేను చదువుకుని వచ్చాను, ఉన్నత ఉద్యోగం చేశాను, పెద్ద స్థాయిలో వ్యాపార రంగంలో రాణిస్తున్నాను. నాకున్న లక్ష్యం వేరే వాళ్లకు ఉండాలనేం లేదు. నేను మాత్రం డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను. పార్లమెంటులో హాజరు మాత్రమే నమోదు చేసుకోకుండా సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నాను. నాకు అన్ని రంగాల పట్ల అవగాహన ఉంది.

అనేక ప్రాంతాల్లో అధికారిగా..

ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటులో హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, పూణె, ఔరంగబాద్, లాతూర్, ఉస్మానాబాద్, నాందేడ్, బెంగుళూరు, గుల్బర్గా వంటి ప్రాంతాల్లో ఉన్నతాధికారిగా పనిచేశారు. మూడేళ్ల సర్వీసు ఉండగానే గుల్బర్గాలో ముందస్తు పదవీ విరమణ తీసుకున్నాను.

అన్ని చూసేశాను..

రాజకీయాల్లోకి వచ్చినవారి మీద ప్రజలకు ఓ భావన ఉంటుంది. వీళ్ల డబ్బులు సంపాదించుకోవడానికి మాత్రమే వచ్చారని. నాకు ఆ అవసరం లేదు. ఉన్నత ఉద్యోగిగా హోదా అనుభవించాను. డబ్బులు చూసేశాను. నా మీద ఆధారపడినవారు లేరు. కొడుకు స్వతంత్రంగా ఎదిగాడు.

చిత్తూరు వాసులు నన్ను సొంతం చేసుకున్నారు

చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు నన్ను తమ సొంత మనిషిలా రిసీవ్ చేసుకున్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థుల హోదాలో నన్ను ఆదరించిన తీరు మరచిపోలేను. కుప్పంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా అన్ని సమావేశాలు, సభల్లో ఆయన నన్ను పక్కనే పెట్టుకునేవారు. బీజేపీ, జనసేన నాయకులు అయితే నన్ను మరింతగా సొంతం చేసుకున్నారు.












వాహనం ఢీకొని చిరుత మృతి

● కళేబరం మాయంపై అటవీ అధికారుల విచారణ

వి.కోట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వి.కోట - పేర్నాంబట్ ప్రధాన రహదారిలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత పిల్ల మృతి చెందింది. మంగళవారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో ఈ చిరుత రోడ్డుపై రక్తపుమడుగులో పడి ఉండగా వాహనదారులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఆలస్యంగా స్పందించిన అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునేలోపు చిరుత కళేబరం మాయమైంది.ఈ ప్రాంతంలో చిరుతల సంచారం లేదని అటవీశాఖ అధికారులు అంటుండగా, ఇటీవల తమ మేకలను, గొర్రెపిల్లలను చిరుతలు తినేస్తున్న ఘటనలు చాలా జరిగాయని అటవీ సమీప గ్రామస్తులంటున్నారు.అసలక్కడ మృతి చెందింది చిరుత కాదని, బావురు పిల్లి అయి ఉంటుందని అటవీ శాఖ అధికారులు అంటున్నారు.మంగళవారం మధ్యాహ్నం జోడు చింతమానుల వద్దకు చేరకున్న చిత్తూరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, పలమనేరు రేంజర్ నారాయణ, డీఆర్‌వో వేణుగోపాల్‌రెడ్డి రోడ్డుపై రక్తపు నమూనాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. నివేదిక రాగానే మృతి చెందిన జంతువు ఏదో నిర్ధారిస్తామన్నారు.అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





చిరుత కళేబరం - ఘటనా స్థలంలో అటవీ శాఖ అధికారుల విచారణ

ఉద్యాన పంటలపై తుపాన్ల దెబ్బ





వర్షాలకు దెబ్బ తిన్న టమోటా తోట - నేల వాలిన వరి పొలం

సోమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వరుస తుపాన్లు ఉద్యానపంటలను దెబ్బతీశాయి. బొప్పాయి, మామిడి, టమోటా పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. మామిడికి డిసెంబరు మాసం నుంచే పూతలు ప్రారంభం కావాల్సి ఉండగా ఇంతవరకు రాలేదు. భూమిలో తేమ శాతం అధికం కావడంతో ఆలస్యంగా పూతలు వస్తాయని ఉద్యానశాస్త్రవేత్తలు చెబుతున్నారు. సోమల మండలంలో 5వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. బొప్పాయి 200 ఎకరాల్లో, అరటి 50 ఎకరాల్లో, టమోటా 400ఎకరాల్లో సాగులో ఉంది. మామిడిని సోమల మార్కెట్ నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా అరటి, బొప్పాయి, మామిడి, టమోటా తోటలవైపు రైతులు వెళ్లడం లేదు. మామిడిలో పూత కోసం తొలి దశలో మందులు పిచికారీ చేశారు. ఫలితం కానరావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు చేయడానికి తెరప లేకుండా వర్షం పడుతుండడంతో కోతలు చేయలేకపోతున్నారు. కోతలు చేసిన రైతుల పొలాల్లో వరి గ్రాసం ఉండడంతో వర్షానికి తడిసిపోతోంది.దీంతో పశువులకు మేత లేకుండా పోతుందని వాపోతున్నారు. ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు వ్యయం చేసిన టమోటా కోత దశలో వర్షాలతో చీడపీడలు వ్యాపించి టమోటాలు దెబ్బతిన్నాయి. మార్కెట్‌కు తరలిస్తే 15 కిలోల బాక్సు వందలోపు పలుకుతోంది. టమోటా సాగు చేసిన రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు.టమోటాకు, మామిడికి బీమా చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించినా రైతులు ఆర్థికంగా నష్టపోయి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు.సోమలమండలంలో 200 ఎకరాలకు మించి వరి కోతలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కోతలు సాగడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలి



ఎకరా టమోటా సాగుకు లక్షకు మించి ఖర్చు వస్తోంది. విడవని తుపాన్లతో టమోటాకు అంతు చిక్కని చీడపీడలు సోకుతున్నాయి.వాటి నివారణకు వేలకు వేలు ఖర్చు చేసినా నివారణ జరగడంలేదు. కోతల సమయంలో పంటలు దెబ్బ తింటున్నాయి. తోటలు నల్లగా మాడిపోతున్నాయి. వర్షాలకు పచ్చికాయలే నేల రాలిపోతున్నాయి. మార్కెట్‌కు పోతే వ్యాపారస్తులు కొనడం లేదు.వర్షాలతో దెబ్బతిన్న టమోటాకు ప్రభుత్వం పరిహారం అందజేయాలి.

- శెట్టివారి నాగరాజ, సోమల

వరుస వర్షాలతో వరి రైతులు గుల్ల



వరుస వర్షాలతో వరి కోతలు చేయలేకపోతున్నాం. పొలాల్లో వరి పైర్లు నేలవాలిపోయాయి.ఇదే సమయంలో వన్యప్రాణులు తరచూ పంటలపై దాడులు చేస్తుంటే ధాన్యపు గింజలు నేల రాలిపోతున్నాయి. పొలాల్లోనే మొలకలు వస్తున్నాయి. కోతలు చేసిన పలువురు రైతుల కుప్పల్లోనే మొలకలు వస్తున్నాయి. వరుస వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నాం.

- రెడ్డెప్ప నాయుడు, పెద్దఉప్పరపల్లె

పూత రాక మందులు పిచికారీ



డిసెంబరు నెల ముగుస్తున్నా మామిడి తోటల్లో పూత రావడంలేదు. వర్షం లేని సమయంలో మందులు స్ప్రే చేసినా పూత రాలేదు. వరుస వర్షాలతో చెట్లకు వేడి వాతావరణం లేక, పొలాల్లో అధిక తేమ ఉండి పూత రాలేదు. మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. ఉద్యానశాఖాధికారులు మామిడి రైతులకు సూచనలు ఇచ్చి రాయితీపై మందులు సరఫరా చేయాలి.

- వినోద్ కుమార్, పెద్దఉప్పరపల్లె

ఉద్యోగం పేరిట రూ.54 లక్షలకు టోకరా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరిట మోసగాళ్లు టోకరా ఇవ్వడంతో తిరుపతి రూరల్ సరస్వతీ నగర్‌లోకు చెందిన ఆర్.సుజాత రూ.54 లక్షలు పోగొట్టుకున్నట్లు సీఐ చిన్నగోవిందు మంగళవారం తెలిపారు. 'ఆమె భర్త సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. పార్ట్‌టైమ్ జాబ్‌కు అవకాశం ఉందని ఆమెకు లింకు పంపారు. ఆ ప్రకారం ఆమె టెలిగ్రామ్ గ్రూపులో చేరారు. 13 బ్యాంకు ఖాతాలకు డిసెంబరు 14 నుంచి 24 వరకు రూ. 54 లక్షలు పంపారు. చివరకు మోసపోయానని గుర్తించి ఫిర్యాదు చేశారు' అని సీఐ వివరించారు.

కొనసాగిన కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ



పరుగుపందేన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు రెండో రోజైన మంగళవారం కూడా పోలీసు పెరేడ్ మైదానంలో కొనసాగాయి. 600 మంది అభ్యర్థులకుగాను 403 మంది హాజరుకాగా 159 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో రెండో రోజు కూడా అధికారులు, సిబ్బంది సమక్షంలో పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల అర్హత పరీక్షలను నిర్వహించారు. హాజరైన 403 మందికి సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా ఎత్తు, ఛాతీని కొలిచారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించగా 159మందిరాతపరీక్షకు హాజరయ్యారు.నిబంధనల ప్రకారం 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు.ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ఎస్‌బీ సీఐలు భాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు జనసేన చేయూత

సోమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు తరలి వెళ్లడానికి జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్ ప్రత్యేక వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన అక్కదేవతల ఆయలం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. చిన్నఉప్పరపల్లె, శీలంవారిపల్లె, గట్టువారిపల్లె గ్రామాల్లో సభ విజయవంతం కోసం కరపత్రాలను అందించారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు హేమగిరి, వీహెచ్‌పీ నాయకులు నరసింహారెడ్డి,మోహన్,టి.సోమశేఖర్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సోమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని.. నూతన సంవత్సరం కావడంతో పోలీసుల సూచనలు పాటించాలని సోమల ఎస్ఐ శివశంకర్ సూచించారు. మంగళవారం సోమల బస్టాండులో ఆయన యువకులు, ద్విచక్రవాహనదారులతో మాట్లాడారు. పబ్లిక్ స్థలాల్లో వేడుకలు అనుమతించబడవని, టపాసులు కాల్చడం నిషేధమని తెలిపారు. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి డ్రైవింగ్ చేయడంతో కలిగే అనర్థాలను వివరించారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోన్న ఎన్డీయే ప్రభుత్వం: ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం చెన్నమ్మగుడిపల్లె, మిట్టపల్లెలో వృద్ధులు, ఒంటరి మహిళలు, ప్రత్యేక ప్రతిభావంతులు, డప్పు కళాకారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక్క రోజు ముందే పింఛన్లను పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. పింఛన్లు ఇవ్వడం ఎన్డీయే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. అర్హులై ఉండి పింఛన్లు రాని వారిని ప్రభుత్వం గుర్తిస్తోందని, త్వరలో వారికి కూడా పింఛన్లను మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరదరాజులస్వామి ఆలయం ముస్తాబు

యాదమరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాది పురస్కరించుకొని ఇంద్రవరదుడి ఆలయం నూతన శోభను సంతరించుకుంది. యాదమరి మండల కేంద్రంలో త్రివేణి సంగమంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయానికి ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా కొత్తరంగులు వేసి, చూడముచ్చటగా రంగవల్లులు తీర్చిదిద్దారు. బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



యాదమరిలోని ఇంద్రవరదుడి ఆలయం



అందమైన రంగవల్లులు

అర్ధగిరికి రెండు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

చిత్తూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తవణంపల్లి మండలం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయానికి బుధవారం నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసును ప్రారంభించనున్నట్లు ఒకటవ డిపో డీఎం కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆదేశానుసారం ఈ సర్వీసును ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు, సాయంత్రం 7.30 గంటలకు రెండు వేళల్లో సర్వీసు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

వరసిద్ధుడి సేవలో ఎమ్మెల్సీలు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం గుంటూరు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కడప ఎమ్మెల్సీ ఎస్వీరామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. వారిని ఏఈవో హరి మాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.1500 బాకీ కోసం హత్య



మృతిచెందిన అజంతుల్లా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రూ.1500 బాకీకి సంబంధించి జరిగిన వివాదంలో ఒకరిని హత్య చేశారు. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు... ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో మహబూబ్ బాషా టమోటా హోల్‌సేల్ దుకాణం నిర్వహిస్తున్నారు. నిమ్మకాయలవీధికి చెందిన రుద్ర ఇతడికి రూ.1500 బాకీ పడ్డారు. మంగళవారం దుకాణం వద్దకు రుద్ర రాగా బాకీ ఇవ్వాలని మహబూబ్ బాషా అడిగారు. పది మందిలో అడుగుతావా అంటూ అతడు దాడి చేశారు. ఆ షాపులో పనిచేసే అజంతుల్లా(38) రుద్రను అడ్డుకోగా అక్కడివారు సర్దిచెప్పి పంపించేశారు. కాసేపటికే తన ఇద్దరు కుమారులు, మరో ఐదారుమందిని తీసుకుని రుద్ర అక్కడకు వచ్చి గొడవకు దిగారు. ఈ క్రమంలో రుద్ర కుమారుడు కత్తితో అజంతుల్లాపై దాడి చేయడంతో అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడి వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కాసేపటికే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్ బాషా చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటనారాయణ, ఈస్ట్ సీఐ రామకృష్ణ, వేలిముద్రల నిపుణలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రుద్ర, అతని కుమారులు యశ్వంత్, కల్యాణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తిరుమల ఆలయం ముందు వరాహాల పరుగులు

తిరుమల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు మూడు అడవి పందులు మంగళవారం భద్రతా సిబ్బందిని పరుగులు పెట్టించాయి. వీఐపీ బ్రేక్ దర్శనాలు జరుగుతున్న సమయంలో రెండు పిల్లలతో ఒక వరాహం ఆలయం ముందుకు వచ్చేసింది. పిల్లలున్న వరాహం ప్రమాదకరం కావడంతో భక్తులు ఆందోళన చెందారు. భద్రతా సిబ్బంది గుర్తించి వాటి వెనుకపడి తరమాల్సి వచ్చింది. కాటేజీలు, హోటళ్ల వద్దకు వదిలేసిన తినుబండారాల కోసం వచ్చే వరాహాలు అప్పుడప్పుడు ఆలయం ముందుకు, మాడవీధుల్లోకి కూడా ఇలా వచ్చేస్తున్నాయి.



తిరుమలలో హడలెత్తించిన నాగుపాము



తిరుమలలో అత్యంత రద్దీగా ఉండే రాంబగీచ సత్రాల వద్ద మంగళవారం ఐదు అడుగుల పొడవైన నాగుపాము భక్తులను హడలెత్తించింది. బస్టాండ్‌లో పామును గుర్తించిన భక్తులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమివ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. దానిని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై 7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ



కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల పెంపు, తగ్గింపు ప్రతిపాదనలపై ఈనెల 7 నుంచి మూడురోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. సదరన్ డిస్కం పరిధిలోని సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. వినియోగదారులు సూచనలు,అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పూతలపట్టు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు యూటీఎఫ్ మండలశాఖ 2025 ఏడాదికి సంబంధించిన నూతన క్యాలెండర్, డైరీని ఆ సంఘం నాయకులు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వాసుదేవన్, మధుసూదన్ రెడ్డి, యూటీఎఫ్ నాయకులు జ్ఞానశేఖర్ నాయుడు, నాగరాజు, రెడ్డెప్ప నాయుడు, చంద్ర, గిరి, మధు, మోహన్, సురేంద్ర, రాజశేఖర్, వడివేలు, యోగి తదితరులు పాల్గొన్నారు.






చిత్తూరు చర్చివీధిలో న్యూఇయర్‌కు బొకేలు, పుష్పగుచ్ఛాల విక్రయం

నూతన సంవత్సర స్వాగతానికి చిత్తూరు బిజీబిజీ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 నూతన సంవత్సరం రాకను స్వాగతించడానికి నగరవాసులు మంగళవారం సందడి చేశారు. నగరంలోని చర్చివీధిలో మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయడానికి పూలబొకేలు, స్వీట్స్, కేక్‌లు కొనుగోలు చేయడానికి దుకాణాల వద్ద కొనుగోలుదారులు క్యూకట్టారు. నగరంలోని అన్ని హోటళ్లలో శాఖాహార, మాంసాహార తినుబండారాల కోసం పలు ఆహార సరఫరా ఏజెన్సీలకు ఆర్డర్లు ఇవ్వడంతో పాటు, స్వయంగా కొనుగోలు చేశారు. నగరపాలక పరిధిలోని అన్నీ మద్యం దుకాణాల వద్ద మద్యపాన ప్రియులు కొనుగోలుక్యూలలో ఎగబడ్డారు. పట్టణ పరిధిలోని ఆలయాల్లో నగరవాసులు ఆయా దేవతలను దర్శించుకునేందుకు అనువుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి నగరంలోని ప్రధాన కూడళ్లలో యువత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.



తిరుమల బేకరీలో కేకుల అమ్మకం



భరత్ బేకరీలో న్యూఇయర్ కేక్ తయారీ



చర్చివీధిలో కొనుగోలుదారుల రద్దీ

3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

పుంగనూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జనవరి 3న విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు బీసీవైపార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. సావిత్రిబాయిపూలె జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బోధనలో ప్రతిభ కనబరిచిన మహిళా ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించి అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.

సారా స్వాధీనం.. మహిళ అరెస్టు

సోమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పేగలవారిపల్లె సమీపంలో సారా విక్రయిస్తున్న గంగరాజమ్మను అదుపులోకి తీసుకొని పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. మంగళవారం గ్రామ సమీపంలోని పొలాల వద్ద నాటు సారా బట్టీను ధ్వంసం చేశారు. గంగరాజమ్మను పుంగనూరు కోర్టుకు హాజరుపరిచారు.

ఆలపాటిని కలిసిన ఏపీఎన్జీవో సంఘ నాయకులు



ఆలపాటి విద్యాసాగర్‌ను కలిసిన ఏపీఎన్జీవో సంఘ నాయకులు ఆనందబాబు, లక్ష్మీపతి తదితరులు

పలమనేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఏపీఎన్జీవో సంఘ ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆలపాటి విద్యాసాగర్‌ను పలమనేరు తాలూక ఏపీఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్ విజయవాడలో కలిసి అభినందనలు తెలిపారు. పలమనేరు ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండరు, డైరీ ఆవిష్కరణ

వెదురుకుప్పం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ క్యాలెండరు, డైరీలను మంగళవారం కార్వేటినగరం ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, మనోజ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యువరాజు, నాయకులు సర్దార్, చంద్రశేఖర్, బాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తవణంపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని పుణ్యసముద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామంలో మురుగు నీటి కాలువలేక ఇబ్బందులు పడుతున్నామని పుణ్యసముద్రానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 2025 ఆర్థిక సంవత్సరంలో తొలి విడతలోనే నిధులు మంజూరు చేయించి మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, టీడీపీ నాయకులు భాస్కర నాయుడు, శరవణ, మణి, చిట్టెమ్మ, జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేనిక్కడే ఇస్తాను... ఇంటింటికీ రాను

పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగి నిర్వాహకం



197 రామాపురంలో వేచి వుండి పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు

గుడిపాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నాకు ఇష్టమొచ్చిన చోటే పింఛన్ ఇస్తాను... అని ఓ సచివాలయ ఉద్యోగి పింఛన్‌దారులపై ఆగ్రహం వ్యక్తంచేసిన సంఘటన చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీచేసినా మంగళవారం మండలంలోని 197 రామాపురం గ్రామంలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమం అందుకు భిన్నంగా జరిగింది. సచివాలయ ఉద్యోగి ఓ చోట కూర్చొని... అందరినీ తానున్న చోటికు రప్పించి పింఛన్లు ఇచ్చాడు. వృద్ధులు, వికలాంగులు ఎలా రావాలని ప్రశ్నిస్తే... నేనిక్కడే ఇస్తాను.. మీకు ఇష్టమొస్తే తీసుకోండి.. లేకుంటే వదిలేయండని సమాధానం చెబుతున్నాడని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్పీలో ముగ్గురికి కారుణ్య నియామకాలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జడ్పీలో ముగ్గురికి కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇస్తూ జడ్పీ సీఈవో మంగళవారం ఉత్తర్వులు చేశారు. స్థానిక జడ్పీ సమావేశం అనంతరం జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడులు నియామక పత్రాలను అందజేశారు.



ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

యాదమరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ముద్రించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను మంగళవారం ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్ యాదమరి ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, జిల్లా శాఖ అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షులు గుణశేఖర్, ప్రధాన కార్యదర్శి రమేష్, అధ్యక్షులు అరుణ్‌కుమార్, సంఘ నాయకులు గణపతి, రంగనాథం, ఉమ, మణిరెడ్డి, బాషా, శశి, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం ఒరూరు రోడ్డు


దుస్థితిలో ఒరూరు రోడ్డు

విజయపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒరూరు వద్ద తిరుత్తణి - నాగలాపురం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఒరూరు మలుపు మర్రి చెట్టు వద్ద లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపు నీరు నిలిచి పెద్ద లోయలా తయారై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డులో కొత్తగా ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ ప్రమాదాల బారిన పడుతున్నారని, నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఒరూరు రోడ్డులో మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



దినకర్ కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందజేస్తాం


దినకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త దినకర్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మృతుడి స్వగ్రామం నలగాంపల్లెకు వచ్చిన వారు దినకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మృతుడి కుమార్తె, కుమారుడిపై రూ.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఎంపీ తన సొంత నిధుల నుంచి రూ.2.50 లక్షలు ప్రకటించగా ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ మరో రూ.2.50 లక్షలను అందజేయనున్నారు. పార్టీపరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్ నాయుడు, జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, మాజీ ఐపీఎస్ స్వామి, మండలపార్టీ ప్రధానకార్యదర్శి జనార్ధన్‌గౌడ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి, సర్పంచ్ సీబా స్వామిదాస్, ఎంపీటీసీ ప్రసన్న, జిల్లా బీసీసంఘ అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిస్సహాయులకు అండగా

న్యాయ సేవాధికార సంస్థ సేవలు


మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి భారతి

యాదమరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సెల్ సెక్రటరి భారతి పిలుపునిచ్చారు. యాదమరి మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం న్యాయసేవాధికార సంస్థ అందించే సేవలపై న్యాయవాదులతో కలిసి డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళల రక్షణకు ప్రత్యేకంగా చట్టాలు అమలుచేయడం, నిస్సహాయ మహిళలకు పనిచేసే చోట, కళాశాలల్లో వివక్షకు గురైనా, గృహహింస, వరకట్న వేధింపులకు గురైన మహిళలకు జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయసేవాధికార సంస్థ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల బాలికలకు అవగాహన కల్పించాలని న్యాయవాదులు హిమబిందు, మేరి తెలియజేశారు. ఎంపీడీవో వేణు, ఏపీఎం ఈశ్వరి, విజయ్‌భాస్కర్, సీసీలు లక్ష్మీపతి, మంజుల, మల్లీశ్వరి, వెంకటేష్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



హెచ్‌ఎం సేవలు అభినందనీయం


హెచ్‌ఎం పరమాత్మయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

వెదురుకుప్పం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మారేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎనమల పరమాత్మయ్య సేవలు అభినందనీయమని వెదురుకుప్పం ఎంఈవో దామోదరం అన్నారు. మంగళవారం వెదురుకుప్పం ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో పదవీ విరమణ పొందిన పరమాత్మయ్యకు సన్మాన కార్యక్రమం జరిగింది. పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరప్రసాద్, ఉపాధ్యాయ సంఘ నాయకులు జి.దేశయ్య, సుభాష్, డి.పీతాంబరరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్, డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నగరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరి డివిజన్ స్థాయిలో యూటీఎఫ్ 2025వ సంవత్సర క్యాలెండర్, డైరీ, జీవోబుక్, ఎస్ఎస్‌సీ స్టడీమెటీరియల్, మోడల్‌పేపర్లను మంగళవారం ఆర్డీవో భవానీ శంకరి ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి బోధించాలని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ జనవరి 5, 6, 7 తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యారంగ మేధావులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేనిక్కడే ఇస్తాను... ఇంటింటికీ రాను

- పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగి నిర్వాహకం


197 రామాపురంలో వేచి వుండి పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు

గుడిపాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నాకు ఇష్టమొచ్చిన చోటే పింఛన్ ఇస్తాను... అని ఓ సచివాలయ ఉద్యోగి పింఛన్‌దారులపై ఆగ్రహం వ్యక్తంచేసిన సంఘటన చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినా మంగళవారం మండలంలోని 197 రామాపురం గ్రామంలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమం అందుకు భిన్నంగా జరిగింది. సచివాలయ ఉద్యోగి ఓ చోట కూర్చొని... అందరినీ తానున్న చోటికు రప్పించి పింఛన్లు ఇచ్చాడు. వృద్ధులు, వికలాంగులు ఎలా రావాలని ప్రశ్నిస్తే... నేనిక్కడే ఇస్తాను.. మీకు ఇష్టమొస్తే తీసుకోండి.. లేకుంటే వదిలేయండని సమాధానం చెబుతున్నాడని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముందస్తు నూతన సంవత్సరాది వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దిలీప్‌కుమార్

వెదురుకుప్పం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం లక్ష్మీనరసింహ విద్యాసంస్థలో మంగళవారం ముందస్తుగా నూతన సంవత్సరాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆ సంస్థ అధినేత దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగులు నింపాలని, పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్, జమున, శరవణ, వేణుగోపాల్, భవాని, శీను, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచరుకు సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

బంగారుపాళ్యం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బోడబండ్ల జిల్లా ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్సు ఉపాధ్యాయుడు చెరుకూరి బాబు నాయుడు మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీవైఈవో వాసుదేవ నాయుడు, ఎంఈవో నాగేశ్వరరావులు మాట్లాడుతూ బాబు నాయుడు 34 సంవత్సరాలు అంకితభావంతో విధులు నిర్వహించారని అన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవడానికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఆయనను పలువురు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, విద్యార్థులు, గ్రామస్తులు దుశ్శాలువాలతో సన్మానించారు.







వాహనం ఢీకొని చిరుత మృతి

● కళేబరం మాయంపై అటవీ అధికారుల విచారణ



ఘటనా స్థలంలో అటవీ శాఖ అధికారుల విచారణ



చిరుత కళేబరం

వి.కోట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వి.కోట - పేర్నాంబట్ ప్రధాన రహదారిలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత పిల్ల మృతి చెందింది. మంగళవారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో ఈ చిరుత రోడ్డుపై రక్తపుమడుగులో పడి ఉండగా వాహనదారులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఆలస్యంగా స్పందించిన అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునేలోపు చిరుత కళేబరం మాయమైంది.ఈ ప్రాంతంలో చిరుతల సంచారం లేదని అటవీశాఖ అధికారులు అంటుండగా, ఇటీవల తమ మేకలను, గొర్రెపిల్లలను చిరుతలు తినేస్తున్న ఘటనలు చాలా జరిగాయని అటవీ సమీప గ్రామస్తులంటున్నారు.అసలక్కడ మృతి చెందింది చిరుత కాదని, బావురు పిల్లి అయి ఉంటుందని అటవీ శాఖ అధికారులు అంటున్నారు.మంగళవారం మధ్యాహ్నం జోడు చింతమానుల వద్దకు చేరకున్న చిత్తూరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, పలమనేరు రేంజర్ నారాయణ, డీఆర్‌వో వేణుగోపాల్‌రెడ్డి రోడ్డుపై రక్తపు నమూనాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. నివేదిక రాగానే మృతి చెందిన జంతువు ఏదో నిర్ధారిస్తామన్నారు.అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోన్న ఎన్డీయే ప్రభుత్వం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం చెన్నమ్మగుడిపల్లె, మిట్టపల్లెలో వృద్ధులు, ఒంటరి మహిళలు, ప్రత్యేక ప్రతిభావంతులు, డప్పు కళాకారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక్క రోజు ముందే పింఛన్లను పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. పింఛన్లు ఇవ్వడం ఎన్డీయే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. అర్హులై ఉండి పింఛన్లు రానివారిని ప్రభుత్వం గుర్తిస్తోందని, త్వరలో వారికి కూడా పింఛన్లను మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 2025 దోశ



దోశతో 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు దృశ్యం

నగరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ దేశమ్మ ఆలయ సమీపాన గల సీఎస్‌కే హోటల్‌లో మంగళవారం 2025 ఆకారంలో దోశ వేయడం పలువురిని ఆకట్టుకుంది. ఈ దోశను పలువురు ఆసక్తిగా చూశారు.

వెదురు మొక్కల పెంపకం లాభదాయకం

ఐరాల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వెదురు మొక్కల పెంపకం చాలా లాభదాయకమని ఎస్ఆర్ఎల్ఎం ఇండస్ట్రీస్ ఫౌండేషన్ జేపీఈ వెంకటరావు అన్నారు. మంగళవారం బొమ్మసముద్రంలో గ్రామస్థులకు వెదురు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వెదురును పెంచుకోవడం వలన లాభం వస్తుందన్నారు. సర్పంచ్ రఘు, ఏపీఎం నాగరత్న, కార్యదర్శి రమ్య తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఎమ్మెల్సీలు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం గుంటూరు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కడప ఎమ్మెల్సీ ఎస్వీరామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. వారిని ఏఈవో హరిమాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి

నగరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని తడుకుపేట పంచాయతీ ఎస్.వి.పురానికి చెందిన టీడీపీ కార్యకర్త హరినాయుడు(32) భౌతికకాయానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హరినాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి పురుషోత్తం నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేష్ నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్ధగిరికి రెండు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

చిత్తూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తవణంపల్లి మండలం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయానికి బుధవారం నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసును ప్రారంభించనున్నట్లు ఒకటవ డిపో డీఎం కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆదేశానుసారం ఈ సర్వీసును ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు, సాయంత్రం 7.30 గంటలకు రెండు వేళల్లో సర్వీసు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

నగరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం దామరపాకం గ్రామంలో పోలీసులు మంగళవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు నేర రహిత రాష్ట్రంగా మార్చే ప్రక్రియలో భాగంగా దామరపాకంలో దాతల సహకారంతో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. గ్రామస్తులు సహకరిస్తే ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పూతలపట్టు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు యూటీఎఫ్ మండలశాఖ 2025 ఏడాదికి సంబంధించిన నూతన క్యాలెండర్, డైరీని ఆ సంఘం నాయకులు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వాసుదేవన్, మధుసూదన్ రెడ్డి, యూటీఎఫ్ నాయకులు జ్ఞానశేఖర్ నాయుడు, నాగరాజు, రెడ్డెప్ప నాయుడు, చంద్ర, గిరి, మధు, మోహన్, సురేంద్ర, రాజశేఖర్, వడివేలు, యోగి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో నగరి మండలం ప్రథమస్థానం

నగరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీలో చిత్తూరు జిల్లాలో నగరి మండలం 96.17శాతంతో ప్రథమస్థానంలో నిలిచిందని ఎంపీడీవో సతీష్ తెలిపారు. గత ఐదు నెలలుగా నగరి మండలం పెన్షన్ల పంపిణీలో ప్రథమస్థానం దక్కించుకుంటోందని ఎంపీడీవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరదరాజులస్వామి ఆలయం ముస్తాబు



యాదమరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాది పురస్కరించుకొని ఇంద్రవరదుడి ఆలయం నూతన శోభను సంతరించుకుంది. యాదమరిలో త్రివేణి సంగమంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయానికి కొత్తరంగులు వేసి, చూడముచ్చటగా రంగవల్లులు తీర్చిదిద్దారు. బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

విజ్ఞాన ప్రదర్శనలో హారిక ప్రథమ స్థానం



మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల శ్రీనివాసరావు

వి.కోట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గోనుమాకులపల్లె ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హారిక అనే విద్యార్థి జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో నిలిచింది. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన విజ్ఞాన మేళాలో విద్యార్థిని తయారు చేసిన యూటర్న్ ఇన్ సిగ్నలింగ్ అనే ప్రదర్శనకు ప్రథమ బహుమతి అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి తెలిపారు.





చిత్తూరు చర్చివీధిలో న్యూఇయర్‌కు బొకేలు, పుష్పగుచ్ఛాల విక్రయం

నూతన సంవత్సర స్వాగతానికి నగరం బిజీబిజీ



తిరుమల బేకరీలో కేకుల అమ్మకం



భరత్ బేకరీలో న్యూఇయర్ కేక్ తయారీ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 నూతన సంవత్సరం రాకను స్వాగతించడానికి నగరవాసులు మంగళవారం సందడి చేశారు. నగరంలోని చర్చివీధిలో మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయడానికి పూలబొకేలు, స్వీట్స్, కేక్‌లు కొనుగోలు చేయడానికి దుకాణాల వద్ద కొనుగోలుదారులు క్యూకట్టారు. నగరంలోని అన్ని హోటళ్లలో శాఖాహార, మాంసాహార తినుబండారాల కోసం పలు ఆహార సరఫరా ఏజెన్సీలకు ఆర్డర్లు ఇవ్వడంతో పాటు, స్వయంగా కొనుగోలు చేశారు. నగరపాలక పరిధిలోని అన్నీ మద్యం దుకాణాల వద్ద మద్యపాన ప్రియులు కొనుగోలు క్యూలలో ఎగబడ్డారు. పట్టణ పరిధిలోని ఆలయాల్లో నగరవాసులు ఆయా దేవతలను దర్శించుకునేందుకు అనువుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి నగరంలోని ప్రధాన కూడళ్లలో యువత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.



చర్చివీధిలో కొనుగోలుదారుల రద్దీ

కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ



పరుగుపందేన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు రెండో రోజైన మంగళవారం కూడా పోలీసు పెరేడ్ మైదానంలో కొనసాగాయి. 600 మంది అభ్యర్థులకు గాను 403 మంది హాజరుకాగా 159 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో రెండో రోజు కూడా అధికారులు, సిబ్బంది సమక్షంలో పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల అర్హత పరీక్షలను నిర్వహించారు. హాజరైన 403 మందికి సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా ఎత్తు, ఛాతీని కొలిచారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించగా 159మంది రాత పరీక్షకు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ఎస్‌బీ సీఐలు భాస్కర్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తవణంపల్లె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని పుణ్యసముద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామంలో మురుగు నీటి కాలువలేక ఇబ్బందులు పడుతున్నామని పుణ్యసముద్రానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 2025 ఆర్థిక సంవత్సరంలో తొలి విడతలోనే నిధులు మంజూరు చేయించి మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, టీడీపీ నాయకులు భాస్కర నాయుడు, శరవణ, మణి, చిట్టెమ్మ, జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరి కోర్టులో నూతన సంవత్సర వేడుకలు



కోర్టులో కేక్ కట్ చేస్తున్న జడ్జి విష్ణువర్మ, న్యాయవాదులు

నగరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరి జూనియర్, సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను జడ్జి విష్ణువర్మ, న్యాయవాదులతో కలిసి జరుపుకున్నారు. జడ్జి కేక్‌ను కట్ చేయగా, న్యాయవాదులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



యాదమరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ముద్రించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను మంగళవారం ఎంఈవో రుక్మిణమ్మ ఆవిష్కరించారు. ఆ సంఘ నాయకులకు ఎంఈవో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రసాద్, పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, మండల అధ్యక్షుడు శివప్రసాద్, సురేష్ రెడ్డి, హిమబిందు, షహనాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓసీ ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఐరాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఓసీ ఉద్యోగుల 2025వ సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓసీ ఉద్యోగుల రాష్ట్ర ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషాద్రిరెడ్డి, చిత్తూరు ఉమ్మడి జిల్లా జాయింట్ కార్యదర్శి చంద్రమౌళి, చిత్తూరు జిల్లా కార్యదర్శి వివేకానందరెడ్డి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో యూనివర్సిటీలో ఫిట్ ఇండియా వీక్

చిత్తూరు రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ ఫిట్ ఇండియా వీక్ సంబరాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన 2కే రన్‌ను యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ వినోద్ భట్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సేతు రామసుబ్బయ్య, రామయ్య, రాకేష్, ప్రవీణ్, రమ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండరు, డైరీ ఆవిష్కరణ

వెదురుకుప్పం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ క్యాలెండరు, డైరీలను మంగళవారం కార్వేటినగరం ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, మనోజ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యువరాజు, నాయకులు సర్దార్, చంద్రశేఖర్, బాబు పాల్గొన్నారు.